# పరాజితుడు

## శ్రీ తాడిగిరి పోతరాజు

ఊరంతా మాటు మణిగింది.

నూనెలేని 'బెడ్‌రూమ్' లాంపు వత్తిగిలి పడుకోటానికి ప్రయత్నిస్తోంది. మృత్యుశయ్యమీద విలవిలా తన్నుకొంటున్న ప్రాణిలా, రెపరెపలాడుతోంది. మసకమసక కాంతితో భీతి గొలిపే ప్రశాంతత, ఆ ఇల్లంతా ఆవరించింది. ఆ నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ మంచం 'కిర్రు' మని శబ్దంచేసింది.

ప్రయాసతో ఒక శరీరం మంచంపై లేచి కూర్చుంది. రెండు క్షణాలు మౌనం. భారంగా వంగి మంచంక్రింద ఏదో వస్తువుకోసం తడుముకొన్నాయి చేతులు. ఏదీ అందుబాటులో లేదు. 'ఉస్సు'రుమంటూ నిట్టూర్పు వినిపించింది.

"అమ్మా .... భాను' ఆ కంఠం వినిపించింది.

సమాధానం లేదు.

మళ్లీ పిలువలేదు ఆ గొంతు. ఆ శరీరం రెండడుగులు ముందుకు కదిలింది. కాళ్లకు స్పర్శ తగిలింది. చేతికర్ర వంగి అందుకొంది ఆ ఆకారం. దాని ఆసరాతో మరో నాల్గడుగులు ముంధుకు కదిలి, దీపంవత్తి పెద్దదిచేసింది, ఆ శరీరం, వణుకుతున్న చేతితో.

'గుప్పు' న ఇంత వెలుగు ఆ ముఖంపై బడింది. వెలుగు చూడలేక కనురెప్పలు బాధగా మూసికొన్నాయి ఒక్కక్షణం. దవడఎముకలు పొడుచుకొస్తున్న శుష్కవదనం. అర్ధశతాబ్దపు అనుభవాలను ధృవపరిచే పాలిపోయిన, విశాలమైన నుదురు. గుంటలుపడి పీక్కుపోయిన కళ్లు, సన్నగా పొడుగాటి ముక్కు, గిజ్జిగాని గూడులా పెరుగుతూన్న ఆ గడ్డం అస్పష్టంగా కన్పిస్తున్నాయి.

ప్రసరిస్తూన్న ఆ దీపపువెలుగు సహాయంతో చూపు ప్రక్కకు మరల్చాడు. చెంతలోనే చాపమీద ముడుచుకొని పడుకొంది ఓ యువతి. అతుకులువేసిన, చాలీచాలని ఓ చీరె కప్పుకొంది. నిద్రబోతున్న ఆపిల్ల కాళ్లూ చేతులూ చలికి ఒణుకుతున్నాయి.

తనపై కప్పుకొన్న చిరుగులశాలువ తీసి ఆ యువతిపై ప్రేమతో కప్పి తల నిమిరాడు. "పిచ్చితల్లే" అన్నాడు. దీర్ఘంగా ఆపిల్లకేసి చూశాడు. ఆపిల్లకాళ్లవద్ద శాలువా సర్దాడు. వెళ్లి వీధివాకిలి తలుపుతీసి బజాల్లో అడుగుపెట్టాడు.

ప్రక్కయింటినుండి గోడగడియారం పదిగంటలు వినిపించింది.

ఆవరించిన చీకటిని చీలుస్తూ 'బిక్కు బిక్కు' మంటూ మునిసిపాలిటీ దీపస్తంభం వీధిలో నిలబడిఉంది. ఆశ్రయంలేని కుక్కపిల్లలు, చలికి "కుయ్యో"మంటూ ఆ స్తంభం ప్రక్కనే, గొయ్యి తీసికొని పడుకుంటున్నాయి. ఆ కుటిలమైన, ఇరుకుమార్గంలో నడిచే బాటసారులకు సక్రమమార్గాన్ని చూపుతోంది. వెలుగు నిమిత్తంలేని వాళ్లు దాని 'చిమ్నీ' అద్దం పగులగొట్టారు. దాని హృదయం సహస్రధా ముక్కలైపోయింది. నల్లగా తుప్పుపట్టిన రేకుల పీదుగా బొట్లుబొట్లుగా కన్నీరు కారుస్తోంది. దీపపు కాంతిలో స్వేచ్ఛగా తిరుగుతున్నాయి కొన్ని క్షుద్రజీవులు. వాటిని తినటానికై 'తెల్ల బల్లి' ఆ 'చిమ్నీ' అద్దంపై 'వలస' ఏర్పరుచుకొంది.

ఆ వృద్ధుడు రెండడుగులు దీపంకేసి వేశాడు.

ఈదురోమంటూ చలిగాలి ఉధృతంగా వీచసాగింది. దీపస్తంభం గజగజ లాడింది. చిమ్నీ వాకిలితలుపు అటూ ఇటూ కొట్టుకొంది.

ఆ వృద్ధుని ఎడమచెయ్యి స్తంభాన్ని గట్టిగా పట్టుకొంది. కుడిచెయ్యి నిర్లక్ష్యంగా, నిర్జీవంగా చిరిగిన లాల్చీ నుండి వ్రేలాడుతోంది: బలంగా 'గాలి' వీచింది. ఎంగిలాకులు లేచి, క్రొత్తప్రదేశాలకు పయనం సాగించాయి.

దీపం ఆరిపోయింది. బల్లి అతని చేతిమీదుగా క్రిందకు దూకింది. కన్ను పొడుచుకొన్నా కానరాని చీకటి ఒక్కసారే అలుముకొన్నది. క్రమేపి, ఈదురుగాలి నిమ్మళించింది. చెయ్యి పైకెత్తి దీపాన్ని తడిమిచూశాడు. పగిలిన దాని హృదయపు ముక్కలన్నీ చల్లగా తగిలాయి.

వెలుగు నిమిత్తంలేకుండ ముందుకు కదిలాడు. గతుకుల్లో పడి లేస్తూన్న అతని కుంటికాలులా, గత జీవితపు స్మృతుల్లో పడి లేస్తోంది అతని మనస్సు.

వీధిమలుపు తిరిగాడు.

వీధిమలుపులో ఒక గిలకలబావి. అది ఊరికంతటికీ మంచినీళ్లబావి. బావిలోపల కప్పపిల్ల బెకబెకలు, కీచురాళ్ల శబ్దం అవిరామంగా వినవస్తోంది. బావిగట్టుమీద నిర్భయంగా 'దయ్యం' లా కూలబడ్డాడు.

పెద్ద కోలాహలం కళ్లముందు కన్పించసాగింది. ఊళ్లో ఉన్న పెద్ద రెడ్డి, చిన్నరెడ్డి, కరణం, మునసబు, అందరూ మీసాలు దువ్వుకొంటూ, కన్నెర్రచేసికొని, కర్రలు చేతబట్టి తనమీదకొస్తున్నారు.

"ఏం పంతులూ, ఈ గడ్డమీద మా మాటకు ఎదురు చెప్పేవాడివి నీ వొక్కడివే బయల్దేరావ్—నీకు గుండెలుంటే బావిలో చేద వేయించు చూస్తాను" అన్నాడు మునసబు మీసం మీద చెయ్యివేసికొంటూ.

'మా తాత ముత్తవ్వలకాడ్నించి వత్తూన్న ఆచారాన్ని కాదని, గుర్రాన్నీ గాడిదనూ ఒక గాట కట్టేత్తావా !—మాల

మాదిగల చేతినీళ్లు తాగిత్తావన్నమాట, మాకు. నీకు ఎంత దయిర్నం. (ధైర్యం)—ఒక్క వయస్సుమళ్లిన ఆసామి గర్జిస్తున్నాడు, బంగారు మురుగులు పైకి తీసికొంటూ.

మాలమాదిగలు కడవలూ, చేదలూ తీసికొని నిల్చున్నారు బావిగట్టుక్రింద. దొరలు రక్తం కళ్లజూస్తారేమోనని భయపడిపోతున్నారు వాళ్లు.

'అసలు—పంతుల్ని బావిగట్టుమీదనుండి లాగండ్రా'' ఒక డరుస్తున్నాడు.

''పొగరుబోతు వెధవ....రెండచ్చర ముక్కలు నేరవటంతోనే పనయిపోయినట్టేనాంట. వాడికి జాతిలేదని, మనక్కూడా లేదనుకొంటున్నాడు కాబోలు—''ఒక ఆసామీ, చుట్ట కొరుక్కొంటూ ప్రసంగిస్తున్నాడు.

పంతులు నిస్సహాయుడై నిలబడ్డాడు.

అంతలో జీప్‌కారు హారన్ మ్రోగించుకొంటూ వచ్చింది. కలెక్టరు దిగాడు. పోలీసులు బావికేసి నడిచారు.

ప్రత్యర్థులంతా ఒకళ్ల నొకళ్లు త్రొక్కుకొంటూ పోతున్నారు. మాలమాదిగలు మంచినీళ్లు తోడుకొంటున్నారు. పంతులుగారి ముహంపై దరహాసం మెరిసింది.

బావిచెంతనున్న మురుగుకాలువలో తుంగ బొటికలు కొరుకుతోంది, ఒక పంది దాని సంతానంతో. రెండు కుక్కలు దాన్ని కవ్విస్తున్నాయి. ఆత్మరక్షణకై అది 'ఫీ' పెట్టుకొంటూ, సంతానసమేతంగా కదలిపోతోంది.

బావి గట్టుమీద కూర్చున్న అతని కళ్లముందు దృశ్యాలు చెరగిపొయ్యాయి. గట్టుమీదనుంచి లేచి ఒక్కసారి నిట్టూర్చాడు. పొగమంచు, నిశీథజగత్తును చుట్టివేయసాగింది. బాధలూ, అనుభవాలూ అతన్ని చుట్టివేయసాగాయి.

వీధులన్నీ దాటి ఊరిబయటకొచ్చాడు. నల్లని చెట్లగుబుర్లోనుంచి, రణరంగంలో పరాజయంపొందిన యుద్ధభటునిలా, ఎర్రగా, నెత్తురుముద్దలా పైకొస్తున్నాడు చంద్రుడు. చంద్రకాంతిలో నల్లగా హైస్కూలు భవనపు ఉపరితలం కన్పిస్తోంది.

అతను సూటిగా స్కూలువద్దకు చరచరా నడిచాడు. తాళంవేసివున్న గేటు ఇనుపచువ్వల మధ్యగా తల పెట్టి లోపలకు తొంగిచూడసాగాడు. వెన్నెల భవనాన్ని తాకుతోంది. ఆయనదృష్టి భవనపుగదు లన్నిటిలోకి ప్రవేశిస్తోంది.

''గణగణ'' గంట కొడ్తున్నారు. క్షణంలో విద్యార్థులు కోలాహలంగా అటూ ఇటూ పరుగెత్తుతున్నారు. 'బిలబిల' మంటూ క్లాసు రూమ్సులోకి చొరబడుతున్నారు—తను క్లాసురూములో ప్రవేశిస్తున్నాడు. పిల్లలందరూ వినయంగా లేచి నిలబడి 'నమస్తే' అంటున్నారు చేతులు జోడించి. తను పాఠాలు చెబుతున్నాడు. భావిభారత దేశానికి విజ్ఞానజ్యోత్స్నలను వెలిగించటానికి శ్రమిస్తున్నాడు. పెళ్లిపందిరిలా, నిత్యనూతనంగా, శోభించే ఆ బడిలో తను సంతోషంతో పచార్లుచేస్తున్నాడు.

పాఠశాల వార్షికోత్సవం జరుగుతోంది. రంగురంగుల కాగితాలు, తోరణాలు కట్టారు.—విద్యాశాఖాధికారి, ఇంకా కొందరు అతిథు లొచ్చారు. వారితో తను కరచాలనం చేస్తున్నాడు .... వారితోపాటు కలిసి 'తను' కొన్ని మొక్కలు నాటాడు. అదుగో .... ఆ పూలమొక్కను తాను నాటుకున్నాడు....

కమ్మని పరిమళం వెదజల్లే పూలతో విరయబూసింది ఆ తీగె. పువ్వులకోసమై చేతులు చాచాడు ఆ వృద్ధుడు. రెండు చేతులు గేటుచువ్వల మధ్య ఇరుక్కుపోయాయి. కోపం వచ్చిం దతనికి. గేటు పట్టుకొని రెండు ఊపులు ఊపాడు. గేటు అటూ ఇటూ ఊగి అచంచలంగా నిలబడింది. అతను చుట్టూ కలయచూసుకున్నాడు. ఎవర్నో పిలవబొయ్యాడు. ఎవ్వరూ లేరు. విద్యార్థులు లేరు—రంగు కాగితాలు, తోరణాలు, అంతా అదృశ్యమైపోయింది.

రోడ్డుమీద స్కూలుప్రక్కగా లారీ వెళ్తూన్న శబ్దం—గేటుమీద కాంతివంతమైన వెలుగు—వెలుగులో చువ్వలు పట్టుకొన్న అతను—'ఖైదీ' లా అతని నీడ నేలపై బడి వికృతంగా వ్యాపించింది.

వెనుతిరిగి చూశాడు.

దూసుకొస్తూంది శరవేగంతో లారీ—ప్రకాశవంతమైన వెలుగు అతనికళ్లు మూసింది. దృష్టి ప్రక్కకు తిప్పుకొన్నాడు.

గేటుప్రక్కనున్న సిమ్మెంటు స్తంభంలో చలువరాయి పొదగబడి ఉంది. చలువరాతిమీద చెక్కిన అక్షరాలు మిలమిలా మెరిసిపోతున్నాయి వెలుగులో—''భవన నిర్మాణానికి ఎనభైవేలు విరాళమిచ్చిన దాత—స్కూలు కమిటీ శాశ్వత కార్యదర్శి, పంచాయతీబోర్డు అధ్యక్షులు శ్రీ శ్రీ శ్రీ ...... శివరామయ్యగారు.

''దా .... త .... దయా దాక్షిణ్యాలు లేని పశువు—రోగ్'' అతను పళ్లు పటపట కొరికాడు.

లారీ దూసుకుపోయింది. గుడ్డివెన్నెలలో బాట తెలియక చందమామ కారుమబ్బుల్లో చిక్కుకున్నాడు—సైడు కాలువపై వంతెన, దానిప్రక్క ఆకులు రాలి మోడువారిన చెట్టు. దాని విగత వైభవాన్ని తలంచుకొని ఏడుస్తోంది. ఎముకలు కొరికే చలిగాలికి తాళలేక చెట్టుమీద నున్న గుడ్లగూబ శరీరం గగుర్పొడిచేలా అరుస్తోంది.

సీరియస్‌గా ఆ చలువరాతి దగ్గరకు నడిచాడు అతను. గుప్పిళ్లు బిగబట్టి ఊ అంటూ చలువరాతికేసి చూశాడు. రాతిమీద అక్షరాలు పలకరించాయి.

''ఏం పంతులూ ?''

''పంతులు .... వీడి గంజి త్రాగి బతుకుతున్నట్టు''.... మర్యాదలేని పశువు—చీదరింపుతో చూశాడు ఆ రాతికేసి.

''బాగా ఆలోచించుకో—ఇద్ద రాడపిల్లలు కలవాడివి. మామాటకు నీవు విలువిస్తే ముందుముందు మావలన ఎంతో మేలు కలుగుతుంది.'' శివరామయ్య కంఠం పలుకుతోంది.

పంతులు ముభావంగా కూర్చున్నాడు.

అధికారదర్పం, ధనాహంకారం మార్మోగుతున్నాయి ఆ మాటల్లో.

"ఈ ఊరిలో మొదటికాడ్నించీ, మాదే పైచెయ్యి—ఇస్కోలు నెంబర్లుగాగానీ, మునసబుగిరిగానీ ఈరోజు దాకా మేమే చలాయించుకొస్తున్నాం. ఇప్పు డీ పంచాయితీ పెసిడెంటు పెత్తనం, మాలమాదిగలమూలకంగా ఆ ముఠాకు పోతుందంటే మా తల తెగనరికినట్టుందంటే నమ్మపంతులూ" ఒక అజ్ఞానపు కంఠం పట్టుదలను ప్రకటిస్తోంది.

"ఎవరిపట్ల గౌరవాభిమానా లుంటే వారికే ఓటిస్తారు. ఇందులో నా ప్రమేయ మేముంది"—పంతులుగారి సమాధానం.

"నాదేముందంటే అంత తేలిగ్గా గడిచే వ్యవహారం కాదు కామయ్యగారూ—మీ ఉద్యోగం, మీ పిల్లల భవిష్యత్తు మా చేతుల్లో ఉన్నాయన్న విషయం మరచిపోతున్నారు. 'పింఛనీ పుచ్చుకోవాల్సిన ఈ వయస్సులో మాకు మరొక ఉద్యోగం, దొర కటమనేది ...." శివరామయ్య కంఠం, భౌతికజీవితపు విలువలను హెచ్చరిస్తోంది.

"పెళ్లికెదిగిన ఇద్దరు రాడపిల్లలను ఇంట్లో పెట్టుకొని—ఏం పంతులూ! నీ మాటే మాటకానీ, మా మాట చొర నివ్వవు. ఇప్పుడు మామాట కాదని, రేపు వాళ్ళకు ఏ మాన్యా లమ్మి పెళ్ళిళ్ల చేస్తావంట."

అసలిదంతాకాదు పంతులూ! మాలమాదిగలకు నీవు చెప్పి మాకు వాళ్ల ఓట్లు వేయించకపోతే, ఈతూరి పెసిడెంటుపదవి మా ముఠాకు రాదు. ఏదో మా మనిషివని, ఈ యవ్వారం నీ ద్వారా తేల్చుకోవా లనుకుంటున్నాం."

ఆ మాటలు పలుకుతున్న పెదవులు చుట్టలు త్రాగుతున్నాయి. చుట్టపొగ గాలిలో తేలుతోంది. ఆపొగలో పంతులుగారి ఆశయాలు తేలుతున్నాయి. ఆర్థికపరిస్థితుల ప్రభావాల్ని అతని స్థిరసంకల్పాన్ని దెబ్బకొడుతోంది .... జారిపోతున్న నైతికబలాన్ని మళ్లీ పుంజుకొన్నాడు.

"కష్టాలనూ, ఆర్థిక దుస్థితిని అవకాశంగా తీసుకొని ఇతరులను మీ పనులకై వినియోగించుకోకండి. అది చాలా తుచ్ఛమైన మార్గం. మీ సహాయా న్నాశించి మాలమాదిగల ఓట్లు మీ కిమ్మని ప్రచారంచేసే అథోగతికి నేనింకా దిగజారలేదు. డబ్బుకాశించి నా వ్యక్తిత్వాన్ని తాకట్టుపెట్టుకొనే టంత అధముణ్ణికా" నని చివ్వున లేచి ఉత్తరీయం భుజాన వేసుకొని బయటికి నడిచాడు.

"పొగరు. ఏమి చూసుకొనో ఈ బిర్సు .... చూద్దాం—ఆ ఉద్యోగం కాస్తా ఊడబెరికితే కుక్కలా రావాలి మన కాళ్ల వద్దకు". శివరామయ్య ధనాతిశయంతో పలికాడు.

'రాస్కెల్స్ .... ఉద్యోగంకోసం వాళ్ల కాళ్లావేళ్లా పడతాననుకొన్నారు కాబోలు" కసిగా చలువరాతికేసి చూశాడు అతను.

"పరీక్షలకు నిలువబడినప్పుడే మన ఆశయాలకు విలువ నాన్నా, పరిస్థితులకు తలఒగ్గిపోతే మనకూ, సాధారణ మానవునికి బేధమేముంది. నమ్మిన సత్యానికి బలిగావించబడ్డప్పుడే జన్మ సార్థకతగానీ, ఆర్థిక విజయాలూ, సన్మానాలు, జన్మ సార్థకతను నిరూపించే కొలతబద్దలుకావని మీరే చెప్పారు .... అయినా మీ రీ వయస్సులో ఉద్యోగంచేసి మమ్మ పోషించాలా—బి. ఏ. వరకూ చదువు చెప్పించారు. ఇక మన ఇంటిబాధ్యత నాపై ఉంచి మీరు నిశ్చింతగా ఉండండి నాన్న. నేను మీ పెద్ద కొడుకును కదూ" సన్నగా ఒక యువతి కంఠం వినిపించింది.

"అవునమ్మా .... నీపై ఆశలు పెట్టుకొనే ఏమాత్రం చలించలేదు తల్లీ. మూర్ఖులు. నీపాటికూడా తెలియదమ్మా వాళ్లకు. ఏళ్లుండగనే సరా! అమ్మా" .... వృద్ధుని ముఖంలో దరహాసం పొడచూపింది. తన్మయత్వంతో కళ్లు మూసుకున్నాడు. మళ్లీ తెరిచి చూశాడు.

ఎవరూ కన్పించటంలేదు.

'నా .... న్న' పిడికిలి గట్టిగా పట్టుకొని పళ్ళు కొరుక్కున్నాడు. నాలుక తెగింది. రక్తపుబొట్లు ఒక్కొక్కటే లాల్చీమీద పడుతున్నాయి. ఆవేశం కలిగింది. రక్తం ఉద్వేగంతో ప్రవహించేసరికి, శరీరం నిలువలేకపోయింది. వంతెనపై కూలబడ్డాడా ముసలాడు.

'సిటీ యాక్టు' క్రింద ఉన్న దొంగలు స్వగృహాల్లో ఉన్నారో లేక చీకటితో దోబూచులాటకు బయటికి వెళ్లారో తెలిసికోటానికై సైకిళ్లపై బోతున్నారు పోలీసులు—ఒకసారి నిద్రలేచి, మందలు మందలుగా చెట్లు దాటుతున్నయి కాకులు. చలిలో గజగజలాడిపోతూన్నాడు చంద్రుడు.

"నాన్నట .... నాన్న .... రాక్షసి .... ఎంత మోసం చేసింది—కడుపులో చిచ్చుపెట్టింది .... ఎంత అవమానం .... విద్యాబుద్ధులున్నదానివని స్వేచ్ఛగా తిరుగనిస్తే, నాకళ్ళుగప్పి వాడితో" ....

కోపంతో రాయిపుచ్చుకున్నాడు వంగి. బలంగా రోడ్డుపై విసిరాడు. దొర్లుతూ పోతూన్న రాతిపై సైకిలులైటు గ్రుడ్డివెలుగు పడింది. రోడ్డు రాచుకొంటూ సైకిళ్ళాగిన చప్పు డయింది.

'ఎవరు?' పోలీసుకంఠం అడిగింది.

అటు తిరిగి గొణుక్కొంటూన్న ముసలాడు, సమాధానమివ్వలేదు. సైకిళ్ళు దిగారు పోలీసులు. టార్చిలైటు వెలుగు అతనిముఖంపై పడింది. కనుకొలకులనుండి అశ్రువులు రాలి పడుతున్నాయి. నోటినుండి నెత్తురు కారుతోంది. రెండూ కలసి, 'స్పాంజి'లా ఉన్న ఆ మురికిగడ్డంమీదుగా లాల్చీపై బొట్లు బొట్లుగా పడుతున్నాయి.

'టార్చి' బటన్ నొక్కిన శబ్దం వినబడింది. పోలీసులు రెండడుగులు వెనక్కు జరిగారు.

"కామయ్యమాష్టారు! .... కూతురు లేచిపోయిన నాటినుండి మనస్థిమితం లేదు .... పాపం బ్రతికి చెడ్డవాడు—ఈ ఊరి నెంత సైకితీసికొచ్చాడు—"చిన్నస్థాయిలో పోలీసులు మాట్లాడుకొంటున్నారు.

"అది నా కూతురా .... కాదు—నాకూతురు చచ్చిపోయింది" అతని ప్రేలాపన.

'ఇంత చలిగాలిలో .... పాపం ఇంటివద్ద దిగబెట్టి వెళ్దామా'' పోలీసు కంఠంలో జాలి.

'ఇంతదూరం వచ్చాంకదా ! పని ముగించుకొని, దిగ బెట్టేశేద్దాం' రెండవ వాని అభ్యంతరం.

ముంజేతిపై ఉన్న కోటు పైకి లాక్కుని, 'టైం' చూసుకొన్నాడు ఒక పోలీసు. పన్నెండు దాటింది.—సైకిళ్ళు కదలిపొయ్యాయి.

'ఇడియట్స్ .... ఇక్కడ ఒక్క నిముషం ఆగితే, ప్రాణం తీసేద్దును .... అనవసరంగా నా చిట్టితల్లినిగూర్చి అబద్ధాలు ప్రచారం చేస్తారా! .... అమ్మా—శారదా....రా నేను నిన్ను క్షమిస్తాను రా! .... నీమీద ఎన్ని ఆశలు పెట్టుకొన్నాను .... రా .... నాకు 'గీతాంజలి' వినిపించు .... నేను పడుకొని వింటాను .... ''

కళ్ళు మూసికొని వెల్లికిలా పడుకొన్నాడు.

రెండునిముషాలు నిశ్శబ్దంగా గడచిపోయింది.

'' .... దుర్మార్గురాలా .... నిన్ను 'అమ్మా' అని పిలవటానికి అర్హురాలవు కావు .... ఎంత అసభ్యం—ప్రతి బజారువెధవకు నన్ను లోకువచేశావు—నన్ను నల్గురిలో తలెత్తుకోకుండా చేశావు. ఆరోజు .... వాడు, ఆ భాస్కర్ లేకపోతే నన్ను వీధిలోకి లాగి'' ....

అంత చలిగాలిలోకూడా అతని ముహంపై స్వేద బిందువులు ఉద్భవించాయి. రెప్పవాల్చక శిలాప్రతిమలా కూర్చొని, బోసిబోయిన ఆ చెట్టుకేసి చూడ సాగాడు. కళ్ళ ముందు గతజీవితపు సంఘటనలు ప్రత్యక్షమయ్యాయి.

తలుపులు పగులగొడ్తూన్న శబ్దం—కేకలు—అసభ్యపు మాటలు వీధిలో వినవస్తూన్నాయి. ''పంతులూ, తలుపు తియ్యి'' .... కర్రతో ఒకడు తలుపు పొడుస్తున్నాడు. 'మర్యాదగా తలుపుతీస్తావా .... పగులకొట్టమంటావా' ఇంకొకడు వంత పలుకుతున్నాడు, ముల్లుగర్ర చేతబట్టి.

''కూతురు పెళ్ళిచెయ్యలేక ఉన్నవాడని, వాణ్నీ చేరదీసి మరగేసి చూసి చూడనట్టుంటే సరిపోద్దనుకున్నా .... వాళ్ళిద్దర్నీ పట్నంపంపి ఏమీ ఎరగనట్టే ఊళ్లోఉన్నా .... రా బయటికి.''

తలుపులు బాదుతున్న శబ్దం మరింత ఎక్కువైంది.

''ఎంత చదువుకొంటేమాత్రం ఈ డొచ్చినపిల్లను, వయస్సులో ఉన్న కుర్రవానితో తిరగనివ్వడంటే ఏ ఉద్దేశ్యం లేందే ? .... పట్నంలో రిజిష్టరుపెళ్ళి చేసికోమని పంపించి ఏమీ ఎరగనట్టే ఇదొక నాటకం .... ఈ నాటకాలు మన దగ్గర్నా.''

''తలుపు తియ్యకు నాన్నా .... వాళ్ళు నిన్ను చంపుతారు .... మూర్ఖులు .... వాళ్ళజోలికి పోవద్దు నాన్నా .... తలుపు తియ్యకు''.... ఏడుస్తూ, కాళ్ళకు పెనవేసుకు బతిమాలు తోంది తన చిన్న కూతురు.

''పిచ్చిభాను .... నీ వడ్డంరాకు .... చంపనియ్యి .... ఇంత అవమానం జరిగాక బతకటమా .... కొట్టండి .... చంపండి .... రండి .... రండి'' పెద్దగా కేకలుపెటాడు వంతెనమీద కూర్చుని ఆ వృద్ధుడు.

''శివరామయ్యగోరు సెబుతానే ఉన్నారండీ—చినబాబుకు పంతులుగారు మరుగుమందు పెడ్తాడని — అన్నంత పనీ జరిగింది. చినబాబుగోరి మామగారి పెళ్లిపందిరి సూత్తొంటే కడుపు చెరువయిపోతోందండి'' శివరామయ్య జీతగాడు కంట తడిపెట్టబోయి స్తంభించిపోయాడు''— భాస్కర బాబుగోరు .... భాస్కర బాబుగోరు .... అంటూ జనంమీద పడ్డాడు. ఒకనిముషంవరకూ అల్లరి వాయిదా పడింది. వాకిలిమెట్లమీదనుంచి జనం క్రిందకు దిగారు.

''ఏమిట్రా పేలుతున్నావ్ ?'' చెంప చెళ్ళుమంది. ''నోరెత్తావంటే జాగ్రత్త—పళ్ళు రాలగొడతా .... ఒక్కపూట తిండికి గతిలేని వెధవలకుకూడ పంతులు—రాస్కెల్స్ ఒక్క నిముషం ఇక్కడున్నారంటే పోలీసులకు పట్టిస్తా—తలుపులు పగుల గొడ్తార్రా ? జాగ్రత్త ఒక యువ కంఠం, ఆవేశంతో గర్జించింది.

ఇంకా కొందరు యువకులు వచ్చి అతని వెనుక నిలబడ్డారు.

''భాస్కర్ .... నీ వొక్కడవే నన్నర్థం చేసికొన్నవాడివి —నీ వొక్కడివే ఈప్రపంచంలో నన్ను గౌరవించేది—అందరూ నాకు ద్రోహంచేశారు విశ్వాసఘాతకులు .... వాడ్ని....వాడ్ని నేనెంతగా ప్రేమించాను. కన్నకొడుకులా చూసికొంటే చివరకు నా చిట్టితల్లిని నాకు దూరంచేశాడు'' ....

వంతెనమీద కూర్చున్న వృద్ధుడు ఆగి ఆగి ఆవేశంతో పలుకుతున్నాడు. ఆయాసమొచ్చింది. సన్నగా భాధ గుండెల్లో దూసుకుపోయింది. భాధగా మూలుగుతూ గుండెపై చేయి పెట్టుకొని, వంతెనగోడపై వెల్లికిలా పడుకున్నాడు. నిర్మల మైన నింగిపై చందమామ ఒక్కడే దిక్కులేకుండా నిలబడ్డాడు.

* * *

''నాన్నా .... నాన్నా''.... భాను గాద్గదిక కంఠంతో పిలిచింది ప్రక్కనుండి త్రుళ్ళి పడి లేచిన ఆపిల్ల. సమాధానంలేదు. చీకటిలో తచ్చాడుకొంటూ వెళ్ళి మంచంపై తడిమిచూసింది. పెరటితలుపు తీసింది.

ఆకులు రాలిన దానిమ్మ చెట్టు, పూలమొక్కలు మినహా ఏమీ కన్పించలేదు. వెనక్కుతిరిగి గడియవేసింది. 'నాన్నా' అన్న ఆవేదనతో ఇల్లంతా మార్రోగింది. వీధిలోకి పరుగెత్తింది. ప్రక్కఇంటి వాకిలి తట్టింది.

'పిన్నిగారు....పిన్నిగారూ....' శక్తికి మించిన స్థాయిలో అరచింది. తలుపులు'దడదడ' కొట్టింది.

పశువులు మేతమేస్తున్న చప్పుడు మినహా మరింకే సవ్వడి వినరావటంలేదు. ఒక్కక్షణ మాగి మళ్ళీ వినిపించింది.

'వెంకన్నా! .... వెంకన్నా'—! గొళ్లెం తలుపుకేసి కొట్టింది.

'వస్తున్నా' అంటూ ప్రతిసమాధానం వినిపించింది—రెండు మూడు ద్వారాలు తెరుచుకొని వస్తూన్నట్లు అలికిడివినిపించింది.

''ఎవరు ?'' వీధివాకిలి తెరచుకుంది.

వాకిటిచెంతనున్న స్త్రీమూర్తిని చూసి తలుపులు తెరచిన యువకుడు స్తంభించి పొయ్యాడు.

''ఏమిటిభాను ఏమిటి జరిగింది.''

"భాస్కర్ .... మానాన్నగారు మళ్ళీ ఈరోజుకూడా కన్పించటంలేదు. ఏమయ్యారో" అశ్రువులు చెంపలమీదుగా జారిపోతున్నాయి. కుప్పలా మెట్లమీద కూలబడింది.

"ఇంట్లో సరిగా చూశావా ?"

ఏడుస్తూ 'అవు'నన్నట్లు తల ఊపింది.

'సరే....భయపడకు....నేను, మన వెంకన్న కలసి గాలించుకొస్తాం .... మేము వచ్చేవరకూ 'అమ్మ'వద్ద ఉండు—లోనికెళ్ళు .... ఇంత చలిగాలిలో ఎక్కడికి వెళ్ళుంటారు" ....అని కొంచెంసేపు తటపటాయించాడు. ఆపాదమస్తకం, ఆ నిండు యవ్వనిని పరిశీలించాడు. చలికి వణుకుతూ, భుజాలు కప్పుకొంది.

భాస్కర్, తను కప్పుకొన్న 'రగ్గు' వెంటనే తీసి, భానుకు కప్పాడు శ్రద్ధగా. 'రగ్గు' తలమీద వేసుకుని 'కాశ్మీర్'యువతిలా నిల్చుంది భాను. కాని ఆపిల్ల కన్నుల్లో కోపం గ్రహించి కళ్ళు క్రిందకు దించేసుకున్నాడు. ఏదో మాట్లాడా లనుకొన్నాడు. కాని మాట్లాడ లేదు.

'భాను తనమీదనున్న 'రగ్గు' తీసి మంచంపై జార విడిచింది.

అవమానింపబడ్డట్టు బాధపడ్డాడు. నేరస్థునిలా, తల వంచుకొని, న్యాయవాది ముందు, ఖైదీలా నిలబడ్డాడు. ఒకనిముషం గడిచిపోయింది. ఆపిల్ల అతన్ని పరిశీలనగా చూసింది. అతను మళ్ళీ ఈ ప్రపంచంలో పడ్డాడు.

"మాష్టారికి మళ్ళీ మనస్థిమితం ఉండటంలేదా? భాను."

"నీకు తెలియని దేముంది భాస్కర్....పక్షవాతం వచ్చిన నాటినుండి నాన్న ఆరోగ్యం బాగులేదు. మూడు సంవత్సరాలయినప్పటికి, 'అక్క'చేసిన పని అనివార్యంగా తలపుకొచ్చి కృంగిపోతూంటారు నాన్న. దానికితోడు ఆర్థికపరిస్థితులు మరింత వేధిస్తున్నాయి. ఆశయాలపేరుతో, తనకుమాలిన ధర్మంతో జీవితాన్ని ఇతరులకు ధారపోసి రిక్తహస్తాలతో ఉండిపొయ్యాడు. తనమేలు పొందినవాళ్ళను కూడా చేయి చాపి అడుగలేని ఆత్మాభిమానం. వీటికితోడు నాన్నకు నాదొక దిగులు. నా భవిష్యత్తును గూర్చి ఆలోచిస్తూ వెర్రిగా నాకేసి చూస్తూంటారు నాన్న" దుఃఖసంరుద్ధమై పోయింది కంఠం.

అప్పటివరకూ రెప్పవాల్చక, ఆపిల్లముహంకేసి చూస్తున్న భాస్కర్, కనురెప్పలు దించుకొన్నాడు."పరిస్థితులు అంత అధ్వాన్నంగా ఉంటే మీనాన్నగారు చెప్పలేకపోయినా, నీవైనా ఒక్క మాట చెప్పకూడదా భాను ! కాలేజికి పొయ్యాక నేను మారిపొయ్యాననుకొంటున్నావా ? .... లేక చెప్పినా లక్ష్యపెట్టని కఠినహృదయుడ ననుకొంటున్నావా ?"

"అంతమాట నేననగలనా భాస్కర్ ? .... ఇప్పుడేగదా నీ జాలిహృదయానికి చిహ్నంగా నీవు చలిలో ఒణికి పోతున్న నాకు 'రగ్గు' కప్పావ్" ?

అతను కలవరపడ్డాడు .... "నేను చేసినపని తప్పా" అని అడిగాడు అమాయకంగా. 'తప్పొప్పుల వ్యత్యాసం నాకు బాగా తెలియదు భాస్కర్ .... కాని ఇతరులు నాపట్ల జాలీ, సానుభూతి చూపటం నాకిష్టంలేదు. అని ఒక క్షణ మాగి .... నేను రోజూ, చలిలో ఒణికి పోతున్నాను, ఇప్పుడు నీ దయా దాక్షిణ్యాలపై ఆధారపడి నీ 'రగ్గు' కప్పుకొన్నందువలన నాకు కలిగే సౌఖ్యమేముంది?" అంది.

ఆమాటలకు వెంటనే ఏమీ సమాధానం చెప్పలేక 'షాక్'తిన్న వాడిలా, ఒకేభంగిమలో నిలబడ్డాడు భాస్కర్. సమాధానంకోసం, అతని పెదవులపై దృష్టి నిలిపింది తను. భ్రుకుటి పైకెత్తి నిశీధిలోకి చూశాడు. ఒక్క క్షణం కళ్ళు మూసికొన్నాడు.

"సరే .... భాను, మన్నించు—మాష్టారికోసం వెళ్ళి వస్తాను. లోనికెళ్ళి మా'అమ్మ' వద్ద పడుకో"అన్నాడు.

'ఎందుకు వాళ్ళకు నిద్రాభంగం .... మీ రొచ్చేవరకూ ఇక్కడ్నే కూర్చుంటాను'

భాస్కర్ చావిట్లోకెళ్ళి పాలేరు వెంకన్నను నిద్రలేపాడు. టార్చిలైటూ, కర్ర తీసుకొని, వెంకన్నతోసహా మెట్లుదిగి అదృశ్యుడైపొయ్యాడు. స్టూలుమీద కూర్చున్న 'భాను' మంచంపై పడిఉన్న రగ్గుకేసి చూసింది. ప్రేమతో దాన్ని స్పృశించింది. కౌగలించుకొంది. దాన్ని తీసి, ఇంతకుముందు తనకు అతనెలా కప్పాడో ఆవిధంగా కప్పుకొంది. శరీరానికి చలితాకటంలేదు కాని హృదయం ఒణికిపోతోంది. ఐదునిముషాలు గడచిపొయ్యాయి.

ఎవరో మనుషులు వస్తూన్నట్టు కాళ్ళచప్పుడు వినిపించింది. భాను పెద్దపెద్ద అంగలేసికొంటూ వీధివాకిట్లోకి నడిచింది. దట్టంగా పట్టిన మంచులోగుండా ఇద్దరు పోలీసులు ఒక వ్యక్తిని భుజాలపై వేసికొని వస్తున్నారు. కుక్కలు వారిని వెంబడిస్తున్నాయి అరుస్తూ.

"ఎవరు ?" ప్రశ్నించింది.

"మేమేనండీ....మాష్టారు హైస్కూలువద్ద పడిపోయి ఉంటే తీసుకొస్తున్నాం". భాను లోపలికెళ్ళి హరికేన్‌దీపం వత్తి పెద్దదిచేసి తీసుకొచ్చింది. తండ్రికి స్పృహ తప్పిపోయింది. పెదవులు నెత్తురుతో గడ్డకట్టుకుపొయ్యాయి.

"మీరు ముందు లోపలికి పదండి" పోలీసు హెచ్చరించాడు. భాను, లైటు చూపిస్తుంటే పోలీసులు జాగ్రత్తగా కామయ్య మాష్టార్ని లోనికి తీసుకొచ్చి పడుకోబెట్టారు. "బాగా జ్వరమొచ్చింది. జాగ్రత్తగా చూస్తూండం"డంటూ పోలీసులు శలవుపుచ్చుకున్నారు. తడిగుడ్డతో పెదవులచుట్టూఉన్న రక్తాన్ని తుడిచి, తను కప్పుకొన్న రగ్గుతీసి తండ్రికి, జాగ్రత్తగా కప్పింది. తలగడ ప్రక్కగా కూర్చుంది.

కొద్దిసేపటికి, బాధగా మూల్గుతూ, మాష్టారు కళ్ళు తెరచి చూశాడు మెత్తని, ఖరీదైన ఉన్నిదుప్పటి, స్పర్శతెలిసికున్నాడు. ఎర్రగా జ్యోతుల్లా మెరుస్తున్న కళ్ళు ప్రక్కకు తిప్పి తన చిరుగులశాలువాకోసం వెదికాడు. చేతులకు తగలలేదు.

'భాను' కఠినంగా పిలిచాడు.

"ఇక్కడ్నే ఉన్నా—నాన్నా" ఆతురతతో సమాధాన మిచ్చింది.

"ఈ అర్థరాత్రివేళ ఈ రగ్గు" మనింట్లోకి ఎలా వచ్చిందో చెప్పు—నిజం చెప్పు—పాపిష్టిదానా నువ్వు దానికేమీ తీసిపోవు—

అక్కచెల్లెళ్ళు ఇద్దరిద్దరే నాకడుపున చెడబుట్టారు—నేనింట్లో లేనిసమయం చూసి'' .... దగ్గుతెర అడ్డమొచ్చింది. ఆయాస పడి, లేచి కూర్చోబోయినవాడల్లా మళ్ళీ వెల్లికిలావాలి కళ్ళు మూసికొన్నాడు. ఒంటిమీద'రగ్గు'ను, కాళ్ళతో తన్నిపార వేశాడు.

తండ్రి తనపై మోపుతున్న అసత్యనిందారోపణకు ఆ యువతి హృదయం విలవిలా తన్నుకొంది.

ప్రత్యక్షానుభవంలో ఆదర్శాలు అర్థవిహీనంగా కన్పించినప్పుడు, మానసికదౌర్బల్యం ఏర్పడి ఎంతటి విద్యావంతుణ్ణి, చదువు సంస్కారం కలవాణ్ణయినా అవివేకిగా మారుస్తాయి. ఎదురుచూడని అవాంతరాలు, పరిస్థితుల ప్రభావం తనతండ్రి నెలా కృంగదీస్తున్నాయో అవగాహన చేసికొని, నిశ్చలంగా దీపం కేసి చూస్తూ దీర్ఘంగా ఆలోచించ సాగింది.

జీవితంలో ఒకవిధమైన సంయమం, ఉన్నత భావాలతో సంస్కృతితో బ్రతికిన తనతండ్రి సహజమైన యుక్తాయుక్త విచక్షణాజ్ఞానం కోల్పోయి, తనప్రవర్తనను శంకించడం, ఆమెకు దుస్సహమైంది.

వీధిలో అలికిడి విని, లేచి నిలబడింది.

భాస్కర్, వెంకన్నతోసహా ప్రవేశించాడు-''ఎంత వెదికినా జాడ కన్పించటంలే''దంటూ. పోలీసులు తీసుకొచ్చారని తెలిపింది. మాష్టార్ని చూడ్డంకోసం, ఆతృత ప్రకటించాడు భాస్కర్.

''ఇప్పుడే పడుకున్నారు. లేపకు' అంది.

''అయితే వెళ్ళి డాక్టర్ని తీసుకురానా?''

''అవన్నీ తెల్లవారాక చూసుకోవచ్చు భాస్కర్. ఇక నీవెళ్ళిపడుకో''

''సరే. . . . . .వెంకన్నా నీ విక్కడే పడుకో. . . . అవసరముంటే కబురు పంపించు భాను'' అంటూ భాస్కర్ వెళ్ళాడు.

అతను అటు వెళ్లిన కొద్దిసేపటికే కోడి కూసింది. దానికి ప్రతిగా కొన్ని కోళ్ళు మారుపలికాయి. అరకలు నేల గీచుకొంటూ వెళ్తున్నాయి. రోళ్ళల్లో గింజలు దంచుతున్న చప్పుడు వినబడ సాగింది. తెల్లవారిందని తెలిసి చందమామ తెల్లబొయ్యాడు.

'భాను'. . . . .పిలుపు విని ఉలిక్కిపడి వెనుతిరిగి చూసింది. ఫ్లాస్కు, టిఫిన్ చేత్తో పట్టుకొని, డాక్టర్ని వెంటబెట్టుకొని భాస్కర్ లోనికొచ్చాడు. తరువాత వాళ్ళ 'అమ్మ—నాన్న' వచ్చారు.

''జ్వర మెలావుంది—ఎక్కువైందా'' అంటూ ముసలాయన ప్రశ్నించాడు.

''వాడితో చెప్పలేకపోతే, పోని నాతోనైనా చెప్పకూడదు. నాన్నకు ఒంట్లో బాగుండలేదని—ఏమిటి ఈ చిరిగిన బట్టలు—పిచ్చితల్లి. బట్టలు మార్చుకుందువుగాని రా. . . . .ఏదో పొలం పనులమూలంగా తీరికలేకపోతే. . . . .మీ అమ్మ చచ్చిపోయినా, నే బ్రతికే ఉన్నానుగా'' అంటూ ఆప్యాయంగా రెక్క పుచ్చుకొని, లాక్కుపోయింది భాస్కర్ తల్లి.

మూగదానిలా అనుసరించింది భాను.

''అమ్మాయ్. . . . .వాళ్ళకింతబెట్టి పొలాలు పంపించి వస్తా. . . . . . .నాన్నకు జ్వరం తగ్గేవరకూ మా ఇంట్లోనే భోంచెయ్యి. . . . . .నీవు తినే పిట్టమెతుకులకు వేరే వంటెందుకు?'' అని మళ్ళీ విడిచి వెళ్ళింది.

ప్రేక్షకులందరూ ఒక్కొక్కరే తప్పుకొన్నారు.

చెయ్యి విరిగిపోయిన 'కుర్చీ'లో కూర్చొని, భాస్కర్ దినపత్రిక చదువుకోసాగాడు. ఎనిమిదిగంటలవరకూ మాష్టారికి మెళుకువ రాలేదు. అప్పటివరకూ భాను అతన్ని పల్కరించలేదు. పల్కరించటానికై అతను తనకేసి చూస్తే దోషిలా చూపులు క్రిందకు దించుకుంది. అంతే—భరింపరాని స్తబ్ధతలో రెండు గంటలు గడిచిపోయాయి.

మాష్టారికి మెళుకువకలిగి కళ్ళు తెరచాడు. రెండు చేతులెత్తి వినయంగా గురుదేవులకు సమస్కరించాడు భాస్కర్. ప్రత్యభివందనం చెయ్యటానికై ఛాతిపై పెట్టుకొన్న చెయ్యి కొద్దిగా పైకెత్తాడు.

'ఏరా భాస్కర్—కాలేజీకి వెళ్ళలేదా'' సహజధోరణిలో పల్కరించాడు. ''ఇప్పుడు సెలవులు కాదాండీ. . . .అందువలన ఇంటివద్దనే ఉన్నాను. . . .మీరు కొంచెం లేచి ముహం కడుక్కొని ఈ మందు వేసికొని కాఫీ త్రాగండి—తరువాత కొద్దిసేపాగి ఈ మాత్రలు వేసుకోమన్నాడు డాక్టర్'' అన్నాడు.

మాష్టారు, ముహం కడుక్కొని, మందూ కాఫీ తీసికొన్నారు. కొద్దిసేపు తటపటాయించి మొదలెట్టాడు. ''సార్. . . . చిన్నప్పటినుండి నాకు విద్యాబుద్ధులు నేర్పి ఇంతవాణ్ణిగా తయారుచేశారు. . . . .నేను మీకెంతో ఋణపడి ఉన్నాను. దాన్ని నే నేవిధంగాకూడా తీర్చుకోలేను. . . . .అయితే మీరు ఈ వయస్సులో ఆర్థికపరిస్థితులను గూర్చి ఆలోచించి ఆరోగ్యం పాడుచేసికోకండి. . . . .అంటే మీరు నాయెడల చూపిన ప్రేమకు డబ్బుతో విలువకట్టడంకాదు. . . . .నేను కాలేజీకి వెళ్ళిపోతాను కదా. . . . .అందువలన ఇప్పటికి ఈ రెండు వందలూ తీసికొని ప్రస్తుతావసరాలు గడుపుకోండి. . . . . తరువాత. . . . . .'' చెప్పదలచుకొన్న మాటలు, కొత్తగా ఉపన్యాసమిస్తున్న యం. యల్. ఏ. లా చెప్పాడు.

మాష్టారు చేతిలోఉన్న నోట్ల కట్టలవైపు నిశితంగా ఒక చూపు విసిరాడు. ఆయాసంతో ఆయన ఛాతి ఎత్తుగా ఉబ్బింది. కొరకొర ఆ డబ్బుకేసి చూసి, బలంగా ఆ డబ్బు లాక్కుని విసురుగ్గా భాస్కర్ ముహాన విసిరి కొట్టాడు.

'డబ్బుతో నన్ను మోసంచేద్దామనుకొంటున్నావా — రోగ్-ఈ వేషాలిక నా వద్ద సాగవ్—జాగ్రత్త రెండు నిముషాలిక్కడున్నావంటే పోలీసులకు పట్టిస్తా—అందర్నీ నమ్మి మోసపొయ్యేటంత అవివేకిని కానిప్పుడు.''—అంత జ్వరంలో కూడ చివ్వున లేచి కోపావేశంతో పలుకుతూన్న వ్యక్తిని చూసి భాస్కర్ దిగ్భ్రమతో నిలబడిపొయ్యాడు. ఆయన మాటలో భావమేమిటో ఎంతసేపటికీ అర్థం కాలేదు.

''వాడికీ, నీకూ ఆంతర్యంలో ఏమీ భేదంలేదు. నాపై విశేషమైన భక్తిగౌరవా లున్నట్టు నటించి నన్ను మోసం చేశాడు. నా తల్లిని నాకు దూరం చేశాడు. మీరు కూడ అలానే మోసంచేసి లేచిపోదామని చూస్తున్నారేమో—ఈ బొందిలో ప్రాణముండగా అలా జరుగదు.''

ప్రాగుబోతు వ్యక్తావ్యక్త ఆలాపనలా, సంధిప్రకమ్మిన రోగిలా మాటలు పలుకుతున్నాడు.

భాస్కర్ పిడుగుపడినవానిలా అంతర్ధానమానుడై పోయ్యాడు.

విద్యావ్యాసంగంద్వారా, అనుభవపూర్వకంగా జీవిత తత్వాన్ని తరచిచూసి బ్రతుకులో ఒక నిర్ణీతమార్గాన్ని సృజించుకొని పురోగమించిన మానవుడు, భౌతికప్రపంచంలో ఎన్ని విఘాతాలు తగిలినా, నమ్మిన సత్యాన్ని అసమాన దీక్షతో పూజించిన ధీశాలి—సనాతనాచారాలలో జీర్ణించిపోతున్న ఊరికి జీవంపోసిన అపరదైవం—తనలాటి విద్యార్థులలో, విజ్ఞాన జ్యోత్స్నలను వెలిగించి, విరియించి, జీవితపరమావధి చూపిన అఖండజ్యోతి—ఈవిధంగా మాట్లాడటం చూసి విస్తు పోయ్యాడు భాస్కర్.

సంఘం, సన్మానం, సానుభూతి ఎటుచూసినా దూరంగా ఉన్నప్పుడు ఆ నిస్పృహ మానవుడ్ని ఏవిధంగా బలహీనపర స్తుందో, భాస్కర్ అవగాహనచేసికొన్నాడు. మాష్టారి జీవితంలో పూర్వార్థానికీ, ఉత్తరార్థానికీ పోలికంటూ లేదు. శక్తి వంచన లేకుండ, స్వార్థరహితంగా, ప్రజాభ్యుదయంకోసం జీవితం త్యాగంచేసినందుకు తనకు మిగిలిందేమీలేదు. ఆ అనుభవాల వెలుగులో ఎవర్ని నమ్ముతాడు మాష్టారు.

"పో. . . . ముం దిక్కడ్నించి—ఇదుగో నీ డబ్బు" నేలమీద కొంగి డబ్బుతీసి మళ్ళీ విసిరాడు.

యాంత్రికంగా నడిచివెళ్ళాడు భాస్కర్.

చిరిగిన లాల్చీనుండి ఒకచెయ్యి నిర్జీవంగా వ్రేలాడుతూంటే కుంటికాలుతో వంకరఅడుగువేస్తూ చేతిక్రరతో సైగ చేసికొంటూ, ఏవో మాటలంటూ భాస్కర్‌ను వీధివరకూ అనుసరించి, వాకిలి దిగి సూటిగా నడిచివెళ్ళాడు.

టేబిల్‌పై ముహం పెట్టుకొని అచేతనంగా కుర్చీలో కూర్చున్న భాను రెప్పపాటులో వీచిన తుపాను గ్రహించింది. రెండుచేతులూ ముహానికి కప్పుకుంది. పమిటచెరుగు తడిసి పోయింది. ఐదు నిముషాలు గడిచిపొయ్యాయి. కళ్ళు తెరచి చూసింది.

ఎదురుగా, నిలువుగా రెండుముక్కలై మసకబారిన అద్దం—దానిలో తన ప్రతిబింబాన్ని పరీక్షగా చూడసాగింది.

'నల్లని రూపం. నిద్రలేమిచే ఎర్రగా ఉండి, అశ్రువులతో పరివేష్టితమై మెరుస్తూన్న ఇంతింత కళ్ళు. ఎండిపోయి లోపలికిపోయిన బుగ్గలు. చిన్నతనంలో మశూచి పొయ్యటంవలన ముఖంపై ఏర్పడిన చిన్నచిన్న గుంటలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. సన్నగా లీలగా ఉండి అందవికారంగా కన్పిస్తుంది రోగిష్టి దానిలా—ఇంకా తేరిపారా చూచుకొంది. తనకూ తన అక్కకూ ఎంతో తేడా ఉంది—సౌందర్యంలో—తెలివితేటల్లో—అన్నింటిలో.

చెంపలమీదుగా కారిపోయింది కన్నీరు.

"నన్ను .... భాస్కర్" .... తడబడుతూన్న పెదవులతో చిన్నగా ప్రతిబింబంతో పలికింది. తల దించుకొంది. రెండు నిముషాలు గడిచాక ఇల్లంతా కలయజూసి భాస్కర్‌వద్ద కెళ్ళింది. 'టేబిల్'పై కాళ్ళు ఎత్తిపెట్టుకొని ఏకాంతంగా కుర్చీలో కూర్చున్నాడు. ఆకాశంలోకి శూన్యదృక్కులు బరుపుతున్నాడు.

"భాస్కర్ .... నాన్నగా రెక్కడ ?"

నిశ్చల దృష్టితో పిలిచిన వ్యక్తిని ఒక తృటికాలం చూసి చూపు ప్రక్కకు తిప్పుకొన్నాడు.

భాస్కర్ .... నాన్నకు మనస్థిమితం లేదు—జరిగిన దానికి హృదయపూర్వకంగా క్షమాపణ చెప్పుకుంటున్నాను. మా అక్కకు స్వేచ్ఛ ఇచ్చిన ఫలితం, ప్రత్యక్షంగా అనుభవిస్తూ మా నాన్న మనిద్దరి స్నేహాన్ని అనుమానించటంలో అసహజమేముంది .... కానీ బాధ ఏమంటే ఆయన ఆశలకు ఛాయలు కూడ కన్పించటంలేదు. పూర్తిగా పిచ్చివాడయినట్లుంది." అంది భాను.

'నేను వారన్న మాటలకు బాధపడటంలేదు భాను .... వారిలో ఈ పరిణామాలకి కారణాలు ఆలోచిస్తున్నాను..... జాతి కుల మత విచక్షణ లేని ప్రేమవివాహాలను తను ప్రోత్సహించేవాడు .... ఆమాటకొస్తే, 'మీ అమ్మ'ను క్రైస్తవ మతస్థురాలయినప్పటికి ఎవరి మాట వినక పెళ్ళి చేసికొన్నాట్ట .... ఆలాంటప్పుడు" ....

"విమర్శా కెరటం తమకాళ్ళదాకా వస్తే పారిపోకుండా నిలబడేవాళ్ళు బహు కొద్దిమంది ఉంటారు భాస్కర్ .... వాళ్ళలో కొందరు, కెరటం ఉక్కిరిబిక్కిరిచేసి ముంచెత్తుతోంటే భయపడి పరాజితులైపోతారు....." అని,

"అయినా ఆయన మనస్సు చలించటానికిగల కారణాలను తెలిసికొని మనం చేసేదేమీ లేదిప్పుడు" అంది.

ఇద్దరూ కళ్ళలో కళ్ళుపెట్టుకొని ఒక అర నిముషం సేపు చూసికొన్నారు. ఎవరూ చూపులు మరల్చుకో లేదు.

"పోయిన వారం నేనిచ్చిన 'కవరు' పంపావా? మాఅక్కకు" ప్రశ్నించింది. అతను కలవరం చెందాడు. పెదవులు చప్పరించాడు. ఆ పిల్లను సంతోష పెట్టటం కోసం, అబద్ధమాడాడు. "అతి కష్టమ్మీద అడ్రస్ తెలిసికొని, ఆ రెండో రోజునే పోస్టులో వేశాను" అన్నాడు.

ఆమె ముఖం వివర్ణంచెందింది. నిరాశతో అతనికి చెప్పకుండనే కాళ్ళీడ్చుకొంటూ వెళ్ళింది. భాను ఎందుకలా ప్రవర్తిస్తుందో భాస్కర్ కు అర్థంకాలేదు. మూడు సంవత్సరాలనాడు, ఇల్లువదలి వెళ్ళిన అక్కకోసం ఎందుకింత తహతహలాడుతుందో తెలియలేదు. ఎంత ఆచూకీతీసినా, లేచిపోయిన జంటను గూర్చి ఎవరికి ఏసమాచారం తెలియలేదు.

ఆ రోజు సాయంత్రంవరకూ కామయ్యామాష్టారు రాలేదు. ఎవరూ ఆయన్ను వెదకటానికై ఉత్సాహం కనపరచలేదు. భాను దిగులుపడి, ఏ అఘాయిత్యానికి పాల్పడుతుందో, అసలే సునిసితహృదయంకల్గినదని, భాస్కర్, సాయంత్రం ప్రేమతో పరామర్శించాడు.

అయితే, రెండో రోజు ఉదయాన పాలేరువెంకన్న గసబోసికొంటూ వచ్చి "పంతులుగారి చిన్న కూతురు—పంతులు గారి చిన్న కూతురు" .... అని మాట పూర్తిచెయ్యలేకపోతూన్న వాడిమాట విని భాస్కర్ ప్రక్క ఇంటిలోకి పరుగెత్తాడు.

ఉరిబోసుకొని భాను వ్రేలాడుతోంది. కళ్ళు నాలుక కొద్దిగా బయటికొచ్చి వికృతంగా ఉంది. చూడలేక భాస్కర్ మొహానికి రుమాలా అడ్డం పెట్టుకున్నాడు. క్షణంలో ఈ వార్త ఊరంతా పాకిపోయింది. మాష్టారిపై ప్రేమాభిమానా లున్న నల్గుర్ని సైకిళ్ళిచ్చి ప్రక్క ఊళ్ళకు పంపారు-మాష్టారి కోసం. కొందరు పట్నంపోయి గాలించారు. జాడ కన్పించలేదు. పోస్టు మార్టం జరిగింది.

మూడవ రోజు ఉదయంవరకూ మాష్టారికోసంఎదురు చూసి, శవానికి దహనక్రియలు జరిపారు. మాల మాదిగలు, విద్యార్థులు గౌరవంతో శవపేటికను శ్మశానవాటికకు మోశారు. "నీతిగల పిల్లని, మర్యాదగల్గిన పిల్లని" అందరూ హర్షించారు. నా అనేవాళ్ళు లేకుండా ఇలా దిక్కులేని చావు చచ్చిన భాను శరీరాన్ని అగ్ని జ్వాలలు తాకుతోంటే భరించలేక ఉత్తరీయం ముహాని కడ్డంపెట్టుకొని ఇంటిముహం పట్టాడు భాస్కర్. బల్లకు తల ఆన్చి భోరున ఏడ్చాడు భాస్కర్.

సాయంత్రం నాల్గుగంటలకు, తలపైకెత్తాడు. బల్ల మీదున్న పుస్తకాలమధ్యనున్న 'కవరు' అతని దృష్టి నాకర్షించింది. అది 'భాను' తన 'అక్కకు' పంపమని తనకిచ్చిన 'కవరు.' అనాలోచితంగా చించి చదువసాగాడు.

ప్రియమైన అక్క .... శారదకు,

మూడు సంవత్సరాలనుండి నీవు నన్నూ, నాన్ననూ చూడటానికి ఒక్క సారైనా వస్తావని ఎంతో ఆశతో ఎదురు చూశాను. కానీ నీవు రాలేదు. నాలాటి నిర్భాగ్యురాలిని మరచి పోవటమేమంచిది. ఈ పుడమిపై మానవులుగా జన్మెత్తుతారు కొందరు. ప్రపంచంలో వాళ్ళ అవసరమేమిటో, వాళ్ళ బ్రతుకుతో ఎవరికి నిమిత్తమో అర్థంకాదు. అలాటివారిలో నేనొకతను. నాకు ప్రేమించి ఆదరించే ప్రేమికుడూ లేడు—ప్రేమించక పోయినా పెండ్లిచేసికొని నాసేవలనందుకొనే భర్తా లేడు. నన్నుచూసి "అణుకువకల్గిన పిల్ల—నెమ్మదిగా ఉంటుందని" అందరూ అభినందిస్తూంటారు. నీవుచేసిన పనిని దృష్టిలో పెట్టుకొని నన్ను మరింత పొగిడేస్తుంటారు. కానీ ఎవరూ ముందుకొచ్చి నన్ను వివాహం చేసికోరు. కారణమేమంటే నీకు చెల్లిగా, నాన్నకు కూతురుగా పుట్టటమే నేను చేసిన పాపం. వర్ణాంతరవివాహమువలన ఇద్దరు రాడపిల్లల తండ్రి నౌతానని నాన్నకు ముందుగా తెలిసుంటే ఈ ఆశయాలకు దూరంగా ఉండేవాడే. మరో ముఖ్య విషయమేమంటే నాన్న వద్ద డబ్బులేదు—ఎవరైనా డబ్బుకాశించి నన్ను కట్టుకోటానికి రూపంలేక, చదువులేక, కట్నం లేకపోతే, ఏఅర్హత చూచినన్ను పరిగ్రహిస్తారు.

నీవు అలా లేచిపోవడం నాకు దుస్సహమైంది. ఊరంతా మీ ఇద్దరి సంబంధాన్ని నాన్న ప్రోత్సహించాడని మన ఇంటి మీదికొచ్చారు. ఆ అసత్యపు, అర్థవిహీన ప్రేలాపనల ముందు నాన్న తల ఒంచుకొన్నాడు. అవమానంతో కృశించి పక్షవాతం తెచ్చుకొన్నాడు. ఒక కాలూ, చెయ్యి పడిపొయ్యాయి. జీవితాలను హృదయాలనూ సంకుచితపరిచే జాతి, నీతి, మతాలతో పెనవేసికొన్న సాంఘిక దురాచారాలను రూపుమాపి మరో పవిత్రమైన మమతాబంధాలకు తావివ్వాలని చాటిన 'నాన్న', నీవు చేసిన పనిని హర్షించలేక ఆయనబాటనుండి తిరోగమించాడు.

సమాజం, అవినీతిపరులుగా చరిత్రహీనులుగా పరగణిస్తారని భయపడి మీ రావిధంగా సాహసించకపోతే, మీ రిద్దరూ యావజ్జీవ నరకం అనుభవించేవారే. నాకా ధైర్యం లేదు. నైతిక విలువలను, బంధనాలను ఛేదించుకొని బయట పడే సాహసం నాలోలేదు. నేను పిరికి దానను. చిన్నతనంలో నేనూ భాస్కర్ ఎలా ఆడుకొనే వాళ్ళమో నీకు తెలియనిదికాదు. కానీ, ఇప్పుడు భాస్కర్‌ను కన్నెత్తి చూడాలంటే కంపించి పోతాను. అందువల్లనే అందరిచే పొగడ బడుతాను.

భాస్కర్ మేము చదువుకొన్న రోజుల్లో మాదిరిగనే ఇప్పటికి నన్ను ప్రేమతో చూస్తూంటాడు. కానీ అది ప్రేమ కాదు. నాదుస్థితిని చూసి జాలిపడటం. అంతకు మినహా ఏమీ లేదు. ఇది నా బ్రతుకు—తల్లిలేదు-అక్కలేదు. తండ్రికి భారమైపొయ్యాను. జీవితంలో రేపు అనే ఆశ, అంధవిశ్వాసం లేనప్పుడు బ్రతకటంలో అర్థం లేదు. .... నిన్ను బావను ఒక్కసారి చూడాలనిపిస్తుంది. వారంరోజులవరకూ ఎదురు చూస్తూంటాను.

ఇట్లు,

నీ చెల్లి — భాను.

భాస్కర్ కన్నీటిబొట్లు ఉత్తరంపైరాలి, అక్షరాలను చెరిపాయి—'నాకు నీ పట్ల జాలి మినహా ఏమి లేదా భాను" అంటూ మేడపైకి పరుగెత్తాడు. ఊరిబయట శ్మశానంలో, 'భాను' భౌతికదేహానికి చిహ్నంగా, మిణుకుమిణుకు మంటూన్న బూడిదకుప్ప సమాధానం చెప్పలేను.

వీధిలో దీపస్తంభం ఒరిగిపోయింది. దానిప్రక్క నిశ్చలంగా ఉన్న మురుగుకాలువలో మాష్టారి చేతికర్ర వెకిలిగా తొంగిచూస్తుంది.

రవిరాజు అస్తమించాడు. ఊరంతా మాటుమణిగింది.